



## పరిశుభ్రత అందరి బాధ్యత

ఖమ్మంను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో ప్రజలు బాధ్యతగా సహకరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. 8లో



## బోదె సాగు.. బహుబాగు

జిల్లాలో పత్తి రైతులు పలువురు సాధారణ పద్ధతికి బదులు బోదె పద్ధతిలో పంట సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. 8లో

## న్యూస్‌రీల్

### అవాంతరాలు లేకుండా బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న డీసీఎస్‌ఓ

వైరా: జిల్లావ్యాప్తంగా రేషన్‌షాప్‌ల ద్వారా ఎలాంటి అవాంతరాలు లేకుండా బియ్యం పంపిణీ జరుగుతోందని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. వైరా మున్సిపాలిటీ పరిధి సుందరయ్య నగర్‌లోని రేషన్ షాప్‌లో గురువారం ఆయన బియ్యం పంపిణీని పరిశీలించారు. ఈనెలాఖరు వరకు గడువు ఉన్నందున ప్రజలెవరూ ఆందోళన చెందొద్దని తెలిపారు. డీలర్లు కూడా సమయపాలన పాటిస్తూ మూడు నెలల బియ్యం అందించాలని సూచించారు. సివిల్ సప్లయీస్ డీటీ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ కిరణ్‌తో పాటు వెంకటేశ్వరరావు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు జాతీయ లోక్‌అదాలత్

ఖమ్మంలీగల్: జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈనెల 14న ఆదివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. మొత్తంగా 13 బెంచ్‌లు ఏర్పాటు చేస్తుండగా.. రాజీపడదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్, మోటారు ప్రమాదాలు, వివాహ సంబంధిత, బ్యాంక్ కేసులను పరిష్కరించుకోవచ్చునని వెల్లడించారు. పోలీస్, బీమా కంపెనీలు బాధ్యులతో చర్చించి రాజీపడదగిన కేసులను గుర్తించామని తెలిపారు. రాజీమార్గమే రాజమార్గంగా గుర్తించి డబ్బు, సమయాన్ని ఆదా చేసుకునేలా కక్షిదారులు లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

### రైతులకు సరిపడా ఎరువులు



ఎరువుల గోదాంలో పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

నేలకొండపల్లి: వానాకాలం పంటల సాగు చేసే రైతులకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం, పైనంపల్లి, నాచేపల్లి, అప్పలనరసింహాపురంలో సొసైటీలు, మంగాపురం తండాలో ఎరువుల దుకాణాన్ని గురువారం తనిఖీ చేసిన ఆయన ఎరువుల స్టాక్ వివరాలపై ఆరా తీశారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ జూన్ నెలకు కావాల్సిన 25 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, వ్యాపారాలు కృత్రిమ కొరత సృష్టించకుండా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కాగా, 6.61 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నందున డీలర్ల వద్ద కాకుండా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి రైతులు విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో అన్ని పంటలు కలిపి 6.10 లక్షల ఎకరాల్లో సాగవుతాయనే అంచనా ఉందని డీఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఏఓ ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.

### ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన 2025–26వ విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని డీఈఓ ఎస్.సత్యనారాయణ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఆగస్టు 31నాటికి 14ఏళ్లు నిండి, చదవడం, రాయడం రాని వారు పదో తరగతిలో, 15ఏళ్లు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులని వెల్లడించారు. పదో తరగతికి ప్రవేశానికి జనరల్ పురుషులు రూ. 1,550, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీలకు రూ.1,150, ఇంటర్మీడియట్‌కు జనరల్ పురుషులైతే రూ.1,800, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీలకు రూ.1,500 ఫీజు చెల్లించి జూలై 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే, అపరాధ రుసుంతో జూలై 12నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు అవకాశం ఉంటుందని, వివరాలకు ఓపెన్ స్కూల్ సెంటర్లు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో పాటు 80084 03522 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. www.telanganaopenschool.org లేదా సమీపంలోని మీ సేవ, టీజీ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని దరఖాస్తు ప్రింట్ కాపీలను స్టడీ సెంటర్‌లో సమర్పించాలని తెలిపారు.

# మోగిన బడిగంట..





ఎన్నెస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మామిడి తోరణాలు కడుతున్న ఉపాధ్యాయులు

వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలను మామిడి తోరణాలతో ముస్తాబు చేసి విద్యార్థులకు స్వాగతం పలికారు. పలువురిని తల్లిదండ్రులు తీసుకురాగా, ఇంకొందరిని కొత్తగా పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



విద్యార్థులను చేర్పిస్తున్న తల్లిదండ్రులు



బుర్హాన్‌పురం స్కూల్‌లో విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్, ఉపాధ్యాయులు



గంట మోగిస్తున్న సిబ్బంది

# తొలిరోజు వడివడిగా..

- ప్రారంభమైన కొత్త విద్యాసంవత్సరం
- ప్రభుత్వ స్కూళ్లలో 48శాతం హాజరు
- బడిబాటలో 3,387 మంది విద్యార్థుల చేరిక



పువ్వాడనగర్ పాఠశాలను ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: కొత్త విద్యాసంవత్సరం గురువారం మొదలైంది. తొలిరోజు విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకోగా.. ఉపాధ్యాయులు మామిడి తోరణాలు కట్టి పండుగ వాతావరణంలో స్వాగతం పలికారు. జిల్లాలో విద్యార్థులు లేక గత ఏడాది మూతబడిన పలు పాఠశాలల్లో నాలుగింటిని ఈసారి పునఃప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మొదటిరోజే విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలే కాక యూనిఫామ్ అందజేశారు. కాగా, రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్‌నగర్‌లో కొత్త పాఠశాలను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రారంభించారు.

**హాజరు తక్కువే**

విద్యాసంవత్సరం మొదటి రోజు పాఠశాలల్లో హాజరు తక్కువగానే నమోదైంది. జిల్లాలోని 1,214 ప్రభుత్వ పాఠశాలల్లో 54,225మంది విద్యార్థులకు గాను 26,033మంది హాజరయ్యారు. దీంతో హాజరు 48శాతంగా నమోదైందని అధికారులు తెలిపారు. అలాగే, ప్రభుత్వ వసతిగృహాలకు కూడా విద్యార్థులు అంతంతగానే వచ్చారు. సోమవారం నాటికి ఎక్కువ మంది వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ఇక 179మంది హెచ్‌ఎంలు హాజరు కాగా ఒకరు, స్కూల్ అసిస్టెంట స్థాయిలో 2,516మందికి గాను 23మంది సెలవులో ఉన్నారు. అలాగే, ఎస్‌జీటీలు 2,325మందికి గాను 25 మంది సెలవులో ఉండగా ముగ్గురు అనధికారికంగా గైర్హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

**'బడిబాట'తో ఫలితం**

జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల పెంపునకు ఈనెల 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈమేరకు బుధవారం నాటికి 1వ తరగతిలో 1,222మంది, గురువారం 366మంది కలిపి 1,588మంది విద్యార్థులు చేరారు. అలాగే, రెండు నుంచి 10వ తరగతి వరకు 11వ తేదీకల్లా ప్రైవేట్ పాఠశాలల నుంచి 476 మంది, గురువారం 126మంది చేరారని అధికారులు తెలిపారు. అంతేకాక ప్రభుత్వ పాఠశాలల నుంచి ఇంకో ప్రభుత్వ పాఠశాలలకు 1,197మంది రాగా, మొత్తం 3,387 ప్రవేశాలు నమోదయ్యాయని వెల్లడించారు.

**ప్రవేశాలు పెరుగుతాయి..**

విద్యాసంవత్సరం తొలిరోజైన గురువారం విద్యార్థుల హాజరు 48శాతంగా నమోదైంది. బడిబాట ద్వారా ఈ ఏడాది 3,387మంది ప్రవేశాలు పొందారు. ఈ కార్యక్రమంలో భాగంగా మరింత ప్రచారం చేస్తూ ప్రవేశాల పెంపునకు కృషి చేస్తాం.

– సామినేని సత్యనారాయణ, డీఈఓ

# కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి

- సివిల్ సప్లయీస్‌గా డైరెక్టర్‌గా ముజమ్మిల్‌ఖాన్ బదిలీ
- ఏడాదిలో తనదైన ముద్ర వేసిన ముజమ్మిల్‌ఖాన్
- అనుదీప్ ఉమ్మడి జిల్లాకు పరిచయస్తుడే...



అనుదీప్ దురిశెట్టి

**సోమవారం విధుల్లోకి..**

కలెక్టర్‌గా నియమితులైన అనుదీప్ దురిశెట్టి ఈనెల 16న (సోమవారం) బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా పనిచేసిన సమయాన పలుమార్లు ఖమ్మంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశాలకు ఆయన హాజరయ్యారు.

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఇందులో భాగంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను సివిల్ సప్లయీస్‌గా డైరెక్టర్‌గా బదిలీ చేయగా, ఆయన స్థానంలో హైదరాబాద్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనుదీప్ దురిశెట్టిని నియమించింది. గత ఏడాది జూన్ 16న విధుల్లో చేరిన ముజమ్మిల్‌ఖాన్ ఏడాది కాలం కూడా విధులు నిర్వర్తించకున్నా తక్కువ సమయంలోనే పాలనపై తనదైన ముద్ర వేశారు. కొత్త కలెక్టర్‌గా రానున్న అనుదీప్ 2017బ్యాచ్ ఐఏఎస్ అధికారి కాగా, ఆ బ్యాచ్‌లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. ఆయన గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ విధులు నిర్వర్తించారు.

**జగిత్యాల జిల్లా వాసి**

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన అనుదీప్ 1990 జూలై 6న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు దురిశెట్టి మనోహర్ – జ్యోతి కాగా మెట్‌పల్లిలోని సూర్యోదయ హైస్కూల్లో పదో తరగతి వరకు, హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తిచేశాక ఎంసెట్‌లో 45వ ర్యాంక్ సాధించి రాజస్థాన్‌లోని బిట్స్ పిలానీలో ఇంజనీరింగ్ చదివారు. నాలుగో సంవత్సరంలో ఉన్నప్పుడే సివిల్స్‌కు సిద్ధమైన ఆయన రెండో ప్రయత్నంలో 2012లో 790వ ర్యాంక్ సాధించి ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్(ఐఆర్‌ఎస్)కు ఎంపికయ్యాడు. ఐఆర్‌ఎస్‌గా శిక్షణ తీసుకుంటూనే మళ్లీ సిద్ధమయ్యాడు. కానీ 3, 4వ ప్రయత్నాల్లో ఫలితం కానరాకపోగా, ఐదో ప్రయత్నమైన 2017లో ఏకంగా సివిల్స్‌లో జాతీయ స్థాయి ఒకటో స్థానంలో నిలవడం విశేషం. శిక్షణ అనంతరం 2018లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ చేరిన అనుదీప్, అక్కడి కలెక్టర్ ఎం.వీ.రెడ్డి ఉద్యోగ విరమణతో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆతర్వాత 2023 జూలై 14న హైదరాబాద్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

**ముజమ్మిల్ ఖాన్.. ఏడాది**

ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా ఉన్న ముజమ్మిల్ ఖాన్‌ను ప్రభుత్వం సివిల్ సప్లయీస్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. జిల్లా కలెక్టర్‌గా ఆయన గతేడాది జూన్ 16వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడమే కాక పాలనలో తనదైన మార్క్ చూపించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి వుయ్ కెన్ లెర్న్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా కృషి చేశారు. మహిళల అభ్యున్నతి కోసం స్త్రీ శక్తి క్యాంటీన్లు ఏర్పాటుచేయించడమే కాక ఖమ్మంలో మహిళా మార్ట్ ఏర్పాటుచేయించారు. అలాగే, చింతకాని మండలంలో ఇసుక ర్యాంప్ నిర్వహణ బాధ్యతలు కూడా అప్పగించారు. అంతేకాక ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను సన్మానించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే దివ్యాంగులకు ఉచిత భోజనం అమలుచేయిస్తున్నారు. ప్రభుత్వం పథకాల అమలు, ప్రజాపాలన సభలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూభారతి చట్టం సదస్సుల అమలులో సఫలీకృతులయ్యారు. జిల్లా ప్రజలు చైతన్యవంతులని, తన పదవీకాలంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు అందించిన సహకారం మరువలేనిదని ముజమ్మిల్‌ఖాన్ 'సాక్షి'కి తెలిపారు.

# రైతుల పేరుతో రుణాలు స్వాహా?

- ఏదులాపురం సొసైటీ చైర్మన్‌పై ఫిర్యాదుల వెల్లువ
- రుణానికి మించి బకాయి ఉందనే నోటీసులతో వెలుగులోకి..
- విచారణకు ఆదేశించిన జిల్లా సహకార అధికారి



పీఏసీఎస్‌లో వివరాలు సేకరిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉషశ్రీ

ఖమ్మంరూరల్: రూరల్ మండలంలోని ఏదులాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలోని రైతులకు రుణాలు మంజూరు చేయిస్తానని చెప్పి సగం మేర సొమ్మును చైర్మన్ కాజేశారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై పలువురు రైతులు డీసీఓను ఆశ్రయించడంతో విచారణకు ఆదేశించారు. ఏదులాపురం పీఏసీఎస్ చైర్మన్ జర్పుల లక్ష్మణ్ నాయక్‌తోపాటు 51 మంది రైతులతో పీఏసీఎస్‌లో గురువారం సమావేశమైన సొసైటీల జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.ఉషశ్రీ వివరాలు సేకరించారు. అయితే, ఈ అంశంతో తనకేం సంబంధం లేదని చైర్మన్ బదులివ్వడం గమనార్హం. రైతులు మాత్రం చైర్మన్ చెప్పడంతోనే సంతకాలు చేశామని.. కానీ తీసుకున్న రుణం కంటే ఎక్కువ చెల్లించాలని నోటీసులు వస్తున్నాయని వాపోయారు.

**రూ.50 లక్షలకు పైగా రుణాలు..**

ఏదులాపురం పీఏసీఎస్ పరిధిలోని గుండాలతండ, జాన్‌బాద్‌తండా, మద్దివారిగూడెం, గూడూరుపాడు తదితర గ్రామాలకు చెందిన 51మంది రైతులు చైర్మన్ లక్ష్మణ్ నాయక్ ప్రోత్సాహంతో 2023లో రూ.50లక్షలకు పైగా రుణాలు తీసుకున్నారు. వీరందరికీ రుణమాఫీ జరుగుతుందని చైర్మన్ నమ్మబలికినట్లు సమాచారం. కానీ ప్రభుత్వం గత ఏడాది రుణమాఫీ చేసినా ఎక్కువ మందికి కాలేదు. ఆపై సొసైటీ సిబ్బంది రుణాలు చెల్లించాలని రైతులకు నోటీసులు ఇవ్వడం మొదలుపెట్టారు. ఓ రైతు పేరిట రూ.లక్ష రుణం ఉందని చెప్పగా.. ఆయన మాత్రం రూ.50 వేలే తీసుకున్నానని బదులిచ్చాడు. అంతేకాక మరికొందరు రైతులకు ఇలాగే జరగడంతో వ్యవహారం బయటపడింది.

**నిలదీసినా ఫలితం లేక..**

రైతుల రుణాలు మాఫీ కాకపోవడం, తీసుకున్న రుణం కన్నా ఎక్కువగా బకాయి ఉండడంతో చైర్మన్‌ను నిలదీశారు. అయితే, ఆయన రెండు, మూడో విడతలో రుణమాఫీ అవుతుతుందని బదులిచ్చినట్లు సమాచారం. ఇంతలోనే రుణాలు చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో నాలుగు రోజులుగా రైతులు డీసీఓ గంగాదర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డీసీఓ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనలతో విచారణకు ఆదేశించారు. ఈమేరకు సొసైటీల జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.ఉషశ్రీని విచారణ అధికారిగా నియమించగా, గురువారం ఆమె చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్, రైతుల సమక్షాన వివరాలు సేకరించారు.

**విచారణ కొనసాగుతోంది..**

చైర్మన్‌పై రైతులు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ మొదలుపెట్టాం. ఇరువర్గాలతో మాట్లాడగా తనకు సంబంధం లేదని చైర్మన్ చెప్పారు. శుక్రవారం కూడా ఈ అంశంపై విచారణ ఉంటుంది. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాక నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– జి.ఉషశ్రీ, సొసైటీల జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్

# మున్నేటి వరద నియంత్రణకు కార్యాచరణ

పరిశీలించిన ఎన్‌డీఆర్‌ఎఫ్, నీటిపారుదల శాఖ అధికారులు



వరద ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్/కూసుమంచి: మున్నేరు నదికి వచ్చే వరదను ముందస్తుగా గుర్తించి, ముప్పు ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈమేరకు ఖమ్మంలో వరద ప్రభావిత ప్రాంతాలను గురువారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. మున్నేటి వరద ముప్పును అంచనా వేయడం, లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవగాహన, సురక్షిత ప్రాంతాలకు తరలించే అంశాలపై చర్చించారు. గత ఏడాది వరదల నేపథ్యాన ఈసారి ముందుగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. జలవనరుల శాఖ ఈఈ అనన్య, డీఈ ఉదయ్‌ప్రతాప్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం హెడ్ గౌతమ్, సభ్యులు పాల్గొన్నారు. కాగా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం అధికారులు కూసుమంచి మండలంలోని పాలేరు, నాయకన్‌గూడెం గ్రామాల్లో పర్యటించారు. గత ఏడాది పాలేరు రిజర్వాయర్‌కు వరద ముంచెత్తగా ఎదురైన నష్టాన్ని పరిశీలించి అప్పట్లో ధ్వంసమైన ఇళ్ల ఆనవాళ్లను పరిశీలించారు. ఈమేరకు అధికారికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీఓ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా శ్రీహరి



ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్థానంలో శ్రీహరిని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమించారు. అలాగే, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఉమ్మడి వరంగల్‌కు కొనసాగిస్తూ, నల్లగొండ ఇన్‌చార్జ్‌గా ఉన్న తుమ్మల నాగేశ్వరరావును ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు.

# 15నుంచి అవగాహన సదస్సులు

ఖమ్మం సహకారనగర్: పీఎం ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌పై ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనుల వికాసం, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న ఈ పథకం కింద జిల్లాలో 35 గిరిజన ఆవాసాలను ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఈమేరకు అవగాహన కల్పించడమే కాక ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కుల సర్టిఫికెట్, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్ ధన్ బ్యాంక్ అకౌంట్లు అర్హులకు అందిస్తామని తెలిపారు.

**ఏయే గ్రామాల్లో...**

జిల్లాలో 35 గిరిజన గ్రామాలను సదస్సుల నిర్వహణకు గుర్తించామని కలెక్టర్ వెల్లడించారు. ఇందులో భాగంగా మాదారం, పేరుపల్లి, భాగ్యనగర్ తండా, దుబ్బా తండా, గిద్దవారి గూడెం, మాణిక్యారం, బాజు మల్లయిగూడెం, చీమలపాడు, గరిడేపల్లి, పొన్నేకల్, గోవిందరాల, నెమలిపురి, పింజరమడుగు, యాతాలకుంట, బుగ్గపాడు, చెరుకుపల్లి, బురద రాఘవాపురం, నాచారం, రేపల్లెవాడ, కాకరవాయి, సోలిపురం, హస్నాబాద్, ఇస్లావత్ తండా, హైదర్‌సాయిపేట, ఎదుళ్ల చెరువు, గైగోళ్లపల్లి, చౌటపల్లి, భగత్ వీడు, గోరిలపాడు తండా, కోక్యా తండా, దారవీడు, ఈర్లపూడి, చింతగుర్తి, పైనంపల్లి, లక్ష్మీపురంలో సదస్సులు జరుగుతాయని తెలిపారు. ఈ సదస్సుల్లో ఎంపీడీఓ, తహసీల్దార్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

రఘునాథపాలెం: ప్రైవేట్ విద్యాసంస్థలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నందున నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. రఘునాథపాలెం మండలం పువ్వాడనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన విద్యార్థులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లలో అన్ని వసతులు ఉండడమే కాక ఉపాధ్యాయుల కృషితో 10వ తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేశామని తెలిపారు. జిల్లాలో మూతపడిన పాఠశాలలను పునఃప్రారంభించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం కలెక్టర్ స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సామినేని సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ బి.పురంధర్, తహసీల్దార్ ఎస్.శ్వేత, ఎంపీడీఓ అశోక్ కుమార్, ఎంఈఓ రాములుతో పాటు ఉద్యోగులు వై.రాంబాబు, జి.వెంకటలక్ష్మి, జి.విజయకుమారి, బి.శ్రావణి, మోహన్‌దాసు, సిద్దయ్య, సాదిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



చొప్పకట్లపాలెంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

**పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి**

ఎర్రుపాలెం: బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా ప్రవేశాలు పెంచాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. ఎర్రుపాలెం మండలంలోని చొప్పకట్లపాలెంలో గతేడాది విద్యార్థులు లేకపోగా, ఈసారి ఆరుగురు చేరడంతో ఆమె ప్రారంభించగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేసి మాట్లాడారు. కాగా, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత సెంటర్‌కు తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, ఎంపీడీఓ బి.సురేంద్ర, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ రంగారెడ్డితో పాటు ఉద్యోగులు, సిబ్బంది సరిత, శ్రీలత, పుల్లమ్మ, త్రివేణి, రుక్మిణి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 21నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ



టోర్నీ వివరాలు వెల్లడిస్తున్న వీరభద్రం, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీని ఈనెల 21, 22వ తేదీల్లో ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నామని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం తెలిపారు. ఖమ్మంలో గురువారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే టోర్నీ అండర్-13, 15, 17, 19 బాలబాలికలు, సీనియర్స్ పురుషులు, మహిళలు, మాస్టర్స్ విభాగాల్లో జరుగుతుందని పేర్కొన్నారు. సింగిల్స్‌కు రూ.500, డబుల్స్‌కు రూ.వెయ్యి చెల్లించి ఈనెల 19వ తేదీ సాయంత్రం వరకు ఎంట్రీలు సమర్పించాలని, వివరాలకు వి.చంద్రశేఖర్(93969 72349), శ్రీనివాస్‌రెడ్డి(94929 61900)ని సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు దుద్దుకూరి సత్యనారాయణ, వి.చంద్రశేఖర్, కొల్లి రమేష్ పాల్గొన్నారు.

### పమ్మికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నుండి ముదిగొండ మండలం పమ్మి గ్రామానికి కొత్తగా బస్ సర్వీసు ఏర్పాటుచేసినట్లు ఖమ్మం డీఎం దినేష్‌కుమార్ తెలిపారు. ఈ బస్సు ఖమ్మం పాత బస్టాండ్‌లో ఉదయం 8గంటలకు బయలుదేరి ముదిగొండ, లక్ష్మీపురం, చిరుమర్రి మీదుగా 8-50 గంటలకు పమ్మికి చేరుతుందని, తిరిగి అక్కడ 9గంటలకు బయలుదేరి 9-50 గంటలకు ఖమ్మం చేరుకుంటుందని వెల్లడించారు. అంతేకాక సాయంత్రం 4-30 గంటలకు ఖమ్మంలో, 5-30 గంటలకు పమ్మిలో బయలుదేరుతుందని తెలిపారు.

### విద్యార్థుల సంఖ్య మరింత పెరగాలి



ముదిగొండలో పుస్తకాలు అందిస్తున్న డీఐఈఓ

ముదిగొండ/నేలకొండపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు సూచించారు. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీని గురువారం తనిఖీ చేసిన ఆయన అధ్యాపకులతో సమావేశమయ్యారు. మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పెంచడమే కాక ద్వితీయ సంవత్సరం విద్యార్థులంతా హాజరయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా, నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన డీఐఈఓ రవిబాబు విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంఈఓ బి.చలపతిరావు, హెచ్‌ఎం హరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బోదె సాగు.. బహుబాగు

- సంప్రదాయ విధానంలో నష్టాలతో పత్తి రైతుల అనాసక్తి
- కొత్త విధానంతో ఖర్చు తగ్గడమే కాక అధిక దిగుబడి
- నవంబర్ వరకు చేతికి, ఆపై మొక్కజొన్న సాగుకు అవకాశం



ఎత్తు మడులపై పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

తిరుమలాయపాలెం: వాణిజ్య పంటల్లో ప్రధానమైన పత్తి సాగు చేస్తున్న రైతులు చీడపీడలు, అకాల వర్షాలతో నష్టపోతున్నారు. ఇక పంట చేతికి వచ్చాక ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లభించక మరింత భారం పడుతోంది. ఈ నేపథ్యాన రైతులు పెట్టుబడి ఖర్చు తగ్గించుకునేలా కొత్త విధానాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని పలు ప్రాంతాల రైతులు బోదె పద్ధతి(ఎత్తు మడులు) అవలంబిస్తున్నారు. జిల్లాలోని తిరుమలాయపాలెం తదితర మండలాల్లో ఈ విధానంలో పత్తి సాగు చేస్తుండగా, గతేడాది ఒక్క తిరుమలాయపాలెం మండలంలోనే 13వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈసారి ఇది మరింత పెరగనుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

**ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ**

గత సంవత్సరం బోదె పద్ధతిలో సాగు చేసిన రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాక అధిక దిగుబడులు వచ్చాయి. దీంతో ఈసారి పెద్దసంఖ్యలో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. సాధారణంగా పత్తి సాగులో భూమి ఒకే రీతిలో ఉండడంతో అరకలతో పాట్లు చేయడం, కూలీలతో కలుపు తీయించడం వంటి పనులకు ఖర్చు ఎక్కువవుతోంది. అంతేకాక అధిక వర్షాలతో చేన్లలో నీరు నిలిచి పంట దెబ్బ తింటోంది. అదే బోదె పద్ధతిలోనైతే ఎత్తు మడులు ఉండడంతో నీరు నిలవదని రైతులు చెబుతున్నారు. తద్వారా పంటలో పూత, కాత రాలకుండా అధిక దిగుబడి సాధించవచ్చనే ధీమాతో ఉన్నారు.

**ముందుగానే చేతికి**

పత్తి పంటలో నవంబర్ చివరకు వచ్చేసరికి గులాబీ రంగు పురుగు ఆశించడం ఆనవాయితీగా మారింది. కానీ బోదె పద్ధతిలో సాగు చేస్తే ఆ సమయానికల్లా పంట చేతికి రానుండడంతో ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. అంతేకాక పత్తి తీతలు పూర్తికాగానే పంట తొలగించి మొక్కజొన్న సాగు చేయనున్నారు. తద్వారా తక్కువ కాల పరిమితిలోనే రైతులకు రెండు పంటలు చేతికొచ్చి, ఆదాయం పెరిగే అవకాశముంది.

**బోదె సాగుకే రైతుల మొగ్గు**



పత్తి రైతులు పెట్టుబడి ఖర్చు తగ్గించుకునేందుకు బోదె పద్ధతి వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ విధానంతో అరక పాట్లు తప్పడమే కాక అధిక వర్షాలతో నీరు నిలవదు. కలుపు నివారణలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

– నారెడ్డి సీతారాంరెడ్డి, ఏఓ, తిరుమలాయపాలెం

**ఖర్చు తగ్గించుకునేందుకే...**



పత్తిలో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునేందుకు బోదె పద్ధతి అవలంబిస్తున్నాం. గత ఏడాది పలువురు రైతులు ఈ విధానంలో మంచి దిగుబడి సాధించారు. నవంబర్ చివరి నాటికి పత్తి తీసివేసి మొక్కజొన్న సాగుకు అవకాశముంది.

– కాంపాటి శ్రీనివాసరావు, రైతు, ఎద్దుళ్లచెరువు

# ఏళ్ల తర్వాత తెరుచుకున్న బడులు



విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్/వైరా రూరల్: ఖమ్మం రూరల్ మండలం ధాక్యాతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక రెండేళ్ల క్రితం మూతపడింది. దీంతో ఈసారి అధికారులు ఇంటింటికీ వెళ్లి గ్రామపెద్దలు, తల్లిదండ్రులను ఒప్పించడంతో తొమ్మిది మందిని చేర్పించారు. ఈమేరకు తొలిరోజైన గురువారం విద్యార్థులకు విద్యాభ్యాసం చేయించి పుస్తకాలు, యూనిఫామ్, పలకలు, పెన్నులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.కుమార్, ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, వైరా మండలం కేజీ సిరిపురం శివారు గొండ్లపాలెంలో ప్రభుత్వ పాఠశాలను నాలుగేళ్ల మూసివేయగా ఈసారి బడిబాట ద్వారా ఏడుగురు విద్యార్థులు చేరారు. తొలిరోజు ఐదుగురు హాజరుకావడంతో గన్నవరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్.కరుణాకర్‌ను డిప్యూటేషన్‌పై కేటాయించగా పాఠాలు బోధించారు.

### విద్యార్థులు లేక వెలవెల



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వైరారూరల్: మండలంలోని అష్టగుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు లేక విధులకు హాజరైన ముగ్గురు ఉపాధ్యాయులు ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది. విద్యార్థులు లేనందున గతేడాది ఈ పాఠశాలను మూసివేసి ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించారు. మళ్లీ ఈ ఏడాది ముగ్గురు ఉపాధ్యాయులను కేటాయించగా వారు వచ్చినా విద్యార్థులెవరూ చేరలేదు. దీంతో పలువురు పిలి పించి అవగాహన కల్పించడంతో ఇద్దరిని చేర్పేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు.

### ఆదర్శం.. ఉపాధ్యాయ దంపతులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.మురళి, కిష్టారం జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయురాలు కనక దుర్గ ఆదర్శంగా నిలిచారు. వీరు తమ కుమార్తె దివిజ్ఞను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతిలో చేర్పించగా ఉపాధ్యాయులతో పాటు స్థానికులు అభినందించారు.



కుమార్తెకు అడ్మిషన్ ఇప్పిస్తున్న దంపతులు

# నగర పరిశుభ్రత అందరి బాధ్యత..

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే పనులకు ప్రజలు సైతం బాధ్యతగా సహకరించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం ఐదో డివిజన్ ఖానాపురంలో రూ.50లక్షలతో నిర్మించే స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజల సహకారంతోనే ఖమ్మం పరిశుభ్రంగా ఉందని, మొక్కలు నాటడంతో పాటు చెత్తాచెదారం వేయకుండా ఈ ఆనవాయితీ కొనసాగించాలని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు తొలిదశలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందున, మురికి కాల్వల పక్కన నివాసాలు లేకుండా ప్రభుత్వ భూముల్లో కాలనీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏళ్ల క్రితం వైఎస్సార్ కాలనీలో కొందరు ప్లాట్లను నిరాకరించగా, ఇప్పుడు బాధపడుతున్నారని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌డాక్టర్ పి.శ్రీజ, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన మేయర్, అదనపు కలెక్టర్ తదితరులు

**అభివృద్ధి పనుల తనిఖీ**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు, వరదనీటి కాల్వలు, రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన అధికారులకు సూచనలు చేశారు. ఖమ్మం 11వ డివిజన్‌లో వరద కాలువ విస్తరణ పనులను పరిశీలించి మరింత వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే, లకారం చెరువు పరిసరాలు, అల్లీపురం రోడ్డులో గంగమ్మ తల్లి ఆలయం వద్ద పనులపై ఆరాతీశారు. గంగమ్మ తల్లి ఆలయ సమీపాన కాల్వపై ఆక్రమణ జరిగిందనే ఫిర్యాదుతో చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, పాత మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను కూడా మంత్రి పరిశీలించారు. విస్తరణతో షాప్‌లు కోల్పోతున్న వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆర్డీఓ నర్సింహారావు, మున్సిపల్ ఇంజినీర్ వి.రంజిత్, కార్పొరేటర్లు పల్లెబోయిన భారతిచంద్ర, సరిపూడి రమాసతీష్ పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్ అకాడమీలో ప్రవేశానికి పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీలో ఎంపికకు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన గురువారం సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని పది జిల్లాలనుంచి 30 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నారాయణపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, మంచిర్యాల, సంగారెడ్డి జిల్లాల క్రీడాకారులు హాజరుకాగా, సర్టిఫికెట్లు పరిశీలించిన అనంతరం ఫిజికల్ టెస్ట్, ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ఈమేరకు ప్రతిభతో పాటు వైద్య పరీక్షల అనంతరం అర్హులకు అకాడమీ లో ప్రవేశం కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్‌కోచ్ ఎం.డీ.గౌస్, కోచ్‌లు ఎం.శ్రీనివాసరావు, ఎం.డీ.అక్బర్ అలీ, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్, మేనేజర్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాని మోదీది ప్రపంచం మెచ్చిన పాలన

**బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి**



వికసిత భారత్ ప్రతిజ్ఞ చేయిస్తున్న సుధాకర్‌రెడ్డి

సత్తుపల్లిటౌన్: దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటడమే కాక సుపరిపాలన అందిస్తున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని బీజేపీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. సత్తుపల్లిలో గురువారం నిర్వహించిన వికసిత భారత్ మేథోసమ్మేళనంలో ఆయన మాట్లాడారు. భారత్‌ను వికసిత భారత్‌ను తీర్చిదిద్దేలా ప్రధాని అహర్నిశలు పాటుపడుతున్నారని తెలిపారు. పారదర్శక పాలన సాగిస్తూ, పేదరిక నిర్మూలనకు పథకాలు అమలుచేస్తున్నారని చెప్పారు. కాగా, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ హామీలను విస్మరించిందని ఆరోపించారు. తొలుత గుజరాత్ విమాన ప్రమాదం, పహల్గాం మృతులకు నివాళులర్పించారు. అనంతరం వికసిత భారత్ ప్రతిజ్ఞ చేయించి కేంద్రప్రభుత్వ పథకాలతో రూపొందించిన పుస్తకాలు ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, ఈ.వీ.రమేష్, పుల్లారావు యాదవ్, విజయరాజు, నున్నా రవికుమార్, అందే బాబయ్య, కొండపల్లి విజయ్‌కుమార్, వీరంరాజు, శివ, నరేష్, శ్రీను, నాగస్వామి, మిత్రా, దీన్‌దయాల్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, విజయరాజ్ పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో పాలేరు అభివృద్ధి



సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న దయాకర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో పాలేరు నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో తిరుమలాయపాలెం మండలానికి చెందిన 137 మందికి గురువారం ఆయన రూ.45లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న మంత్రి అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. తిరుమలాయపాలెం మండలానికి 50పడకల ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ఐటీఐ కూడా మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్లు బైరు హరినాథబాబు, వనవాసం నరేందర్‌రెడ్డితో పాటు కొప్పుల అశోక్, బోడా మంగీలాల్, రామసహాయం అరవింద్‌రెడ్డి, జడల నగేష్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, గోల్ల లింగయ్య, కిరణ్ పాల్గొన్నారు.



### చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి



చిన్నారుల ప్రతిభను పరీక్షిస్తున్న డీడబ్ల్యూఓ

కొణిజర్ల: తల్లిదండ్రులు తమ చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని జిల్లా సంక్షేమాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి సూచించారు. అమ్మ మాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దమునగాలలో గురువారం నిర్వహించిన ర్యాలీ లో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 – 6 ఏళ్ల లోపు చిన్నారులను చేర్పిస్తే ఆటపాటలతో పాటు చదువు, పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్.కమలప్రియ, ఏసీడీపీఓ ఎం.ఉషారాణి, సూపర్‌వైజర్ ఎం.జ్యోతితో పాటు టీచర్లు పాల్గొన్నారు.

### వేగంగా భూముల రీసర్వే



రీ సర్వే పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసులు

ఎర్రుపాలెం: భూముల రీ సర్వే కోసం మండలంలోని ములుగుమాడును పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈమేరకు గ్రామంలో జరుగుతున్న భూముల సర్వేను జిల్లా ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు సూచనలు చేసిన ఆయన మరింత వేగం పెంచాలని ఆదేశించారు. సర్వేయర్ రాజశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

### రైతులకు పరిహారం చెల్లించండి

**నకిలీ విత్తనాల కేసులో ఫోరం తీర్పు**

ఖమ్మంలీగల్: నకిలీ విత్తనాలను అమ్మిన విత్తన కంపెనీలు పరిహారంగా 26 మంది రైతులకు రూ. 17.50 లక్షలు, విత్తన ఖరీదుతో అదనంగా రూ. 10వేలు కేసు ఖర్చుగా చెల్లించాలని జిల్లా వినియోగదారుల ఫోరం గురువారం తీర్పు చెప్పింది. వివరాలిలా ఉన్నాయి. ముదిగొండ మండలంలోని గోకినపల్లి, కట్టకూరు గ్రామాల్లో 26 మంది రైతులు 2021 ఏడాదిలో సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్లలోని సిరి ఫెర్టిలైజర్స్ 114 ఎకరాల్లో 14 ప్యాకెట్ల పొద్దుతిరుగుడు విత్తనాలు కొనుగోలు చేశారు. మహారాష్ట్రలోని పుణె సమీపంలోనిమాన్సూన్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఈ విత్తనాలు నాటాక పంట సరిగా పండక ముదిగొండ ఏఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆపై ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశీలించి ఇచ్చిన నివేదికతో అవి నకిలీ విత్తనాలుగా తేలింది. దీంతో వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా రైతులకు పరిహారం, విత్తనాల ఖరీదు, కేసు ఖర్చులు చెల్లించాలని తీర్పు వెలువరించింది.

### ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ఊకే రాము (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టగా వాహనదారుడు మృతి చెందాడు. సత్తుపల్లి శివారులో గురువారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి మండలం కుమురంభీం కాలనీకి చెందిన ఊకే రాము(45), ఏసుబాబు సత్తుపల్లి నుంచి గంగారంవైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ఏలూరు వెళ్తూ పట్టణ శివారు పెద్ద వంతెన సమీపాన వీరి వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమాన్ని తాకడంతో ఊకే రాము బస్సు వెనుక టైర్ల కిందపడగా తీవ్రగాయాలతో మృతి చెందాడు. అలాగే, ఏసుబాబు కూడా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. మృతుడు రాము భార్య నాలుగేళ్ల క్రితం మృతిచెందగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గతంలో తల్లిని ఇప్పుడు తండ్రిని కోల్పోయిన కుమార్తెలు రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది.

### ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ మృతి



ఉపేందర్ (ఫైల్)

తిరుమలాయపాలెం: దుక్కి దున్నేందుకు వెళ్లిన ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదవశాత్తు కింద పడడంతో మృతి చెందాడు. మండలంలోని పిండిప్రోలుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కిలారు ఉపేందర్(39) బుధవారం మధ్యాహ్నం ఓ రైతు చేను దున్నేందుకు వెళ్లాడు. ఈక్రమాన ట్రాక్టర్ బండరాయిపైకి ఎక్కడంతో అదుపు తప్పగా కింద పడిన ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఖమ్మంకు అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు. ఉపేందర్‌కు భార్య త్రివేణి ఉండగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### కుమారుడు అన్నం పెట్టలేదని ఫిర్యాదు

తల్లాడ: గొడవ పడిన తన కుమారుడు భోజనం పెట్టలేదంటూ ఓ తల్లి పోలీసులను ఆశ్రయించింది. తల్లాడ మండలం నారాయణపురానికి చెందిన చల్లా తిరపతమ్మకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరి వివాహాలు జరగగా కుమారుడైన చల్లా అశోక్(తంబి) వద్ద ఆమె ఉంటోంది. అయితే, బుధవారం తల్లితో గొడవపడిన ఆయన భోజనం పెట్టకపోవడంతో తిరపతమ్మ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.